

సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 26 । జూలై । 2023



అవకాశాలు ఓపెన్

ఏపీ సార్వత్రిక విద్యా పీఠంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలైంది. అడ్మిషన్లకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. -8లో



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదిలారు.

పేరు పులస.. అమ్మేది విలస



పులస సీజన్ వచ్చేసింది. ఇదే అదనుగా నకిలీ పులసలు కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. అంటే విలస అన్నమాట. చూసేందుకు పులస, విలస ఒకేలా ఉండటంతో చాలా మంది గుర్తించలేకపోతున్నారు. -8లో

న్యూస్‌రీల్

సీఎం జగన్ పర్యటన వాయిదా

సాక్షి, అమలాపురం: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలాపురం పర్యటన మరోసారి వాయిదా పడింది. తొలి షెడ్యూల్ ప్రకారం వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సీఎం జగన్ బుధవారం అమలాపురం రావాల్సి ఉంది. అయితే, భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమాన్ని తొలుత ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు. అయితే, బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడంతో 28న జరగాల్సిన కార్యక్రమాన్ని కూడా వాయిదా వేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఈ నెల 31న జరిగే అవకాశముందని పేర్కొన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు మంగళవారం ఈమేరకు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ధ్రువ పత్రాలతో iti.ap.gov.in అను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 31వతేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీన దరఖాస్తుదారుల ధ్రువ పత్రాలను పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు మూడు,నాలుగు తేదీలలో రాజమహేంద్రవరం ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ప్రైవేట్ అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో ఆగస్టు ఐదు,ఆరు తేదీలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చునని పరమేశ్వరరావు వివరించారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

నేడు పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఈమె పర్యటన జయప్రదం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్మల దత్తు మంగళవారం పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఉదయం 9.30 గంటలకు కొంతమూరు గామన్ బ్రిడ్జికి రోడ్డు మార్గంలో చేరుకుంటారన్నారు. అక్కడి నుండి ర్యాలీగా క్వారీ మార్కెట్ సెంటర్ బీజేపీ కార్యాలయానికి వెళ్లి మీడియా సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా క్వారీ సెంటర్ నుంచి రాజా థియేటర్ రోడ్డు మీదుగా కంబాల చెరువు సెంటర్, నందం గనిరాజు జంక్షన్ మీదుగా బైపాస్ రోడ్డు, రివర్ బే హోటల్‌కు చేరుకొంటారన్నారు. అక్కడ 2.30 గంటలకు పార్టీ జోనల్ సమావేశంలో పాల్గొంటారన్నారు. జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు,అసెంబ్లీ కన్వీనర్లు పాల్గొంటారన్నారు.

కోరుకొండలో భారీ వర్షం

కొవ్వూరు: జిల్లాలో భారీ వర్షం కురిసింది.మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయానికి జిల్లాలో సరాసరి 33.5 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. కోరుకొండలో అత్యధికంగా 71.8 మి.మీటర్లు వర్షం కురిసింది. తాళ్లపూడిలో 69.2, గోకవరంలో 62.4, రాజా నగరంలో 42.0, రాజమహేంద్రవరం రూరల్‌లో 34.4, రాజమహేంద్రవరం అర్బన్‌లో 28.0, సీతానగరంలో 31.2, రంగంపేటలో 32.8, బిక్కవోలులో 42.2, అనపర్తిలో 44.4, కడి లో 29.8 మి.మీటర్లు చొప్పున,గోపాలపురంలో 19.8,నల్లజర్లలో 10.4, దేవర పల్లిలో 18.0,కొవ్వూరులో 23.4,చాగల్లులో21.4, నిడదవోలులో 20.8, ఉండ్రాజవరం లో 13.8, పెరవలిలో 21.4 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి ఓ మోస్తరుగా వర్షం పడుతోంది.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

అమలాపురం రూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ బస్సు ఈ నెల 30వ తేదీన అమలాపురం డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. భక్తులు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ఆలయాలను దర్శించవచ్చని వివరించారు. వచ్చే నెల ఒకటో తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ ముగించుకుని, మూడో తేదీన ఈ బస్సు తిరిగి అమలాపురం చేరుతుందని తెలిపారు. పుష్‌బ్యాక్ 2+2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామన్నారు. దీనికి పెద్దలకు రూ. 2,950, పిల్లలకు రూ.2,200గా చార్జీ నిర్ణయించామని తెలిపారు. అదే ఇంద్రా ఏసీ బస్సుకు పెద్దలకు రూ.4 వేలు, పిల్లలకు రూ.3 వేలుగా టికెట్ ధర నిర్ణయించామన్నారు. వివరాలకు అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)ను 70138 68687, రిజర్వేషన్ కౌంటర్‌ను 99592 25576, బస్ స్టేషన్‌ను 99592 25550 నంబర్లలో సంప్రదించాలని కోరారు. 99500 సర్వీస్ నంబరుతో నడిచే ఈ బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం అందుబాటులో ఉందని డీఎం మూర్తి తెలిపారు.

శాంతిస్తున్న గోదారి



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

తగ్గుముఖం పట్టిన వరద

ధవళేశ్వరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద మంగళవారం గోదావరిలో వరద తగ్గుముఖం పట్టింది. ఉదయం 6గంటలకు 10.40 అడుగులు ఉన్న నీటి మట్టం క్రమేపీ తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్నం సరికి 9.90 అడుగులకు నీటి మట్టం చేరింది. తర్వాత కూడా అదే క్రమంలో మరింత తగ్గింది. రాత్రి ఏడు గంటలకు 9.40 అడుగులకు చేరింది. బ్యారేజ్ లోని మొత్తం 175 గేట్ల నుంచి 6,76,760 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఎగువ కాళేశ్వరం నుంచి విడుదల చేసిన నీటితో మంగళవారం భద్రాచలం వద్ద మళ్లీ నీటి ఉధృతి పెరిగింది. భద్రాచలం వద్ద మంగళవారం రాత్రి ఏడు గంటలకు 39 అడుగులకు నీటిమట్టం చేరినట్లు సమాచారం. ధవళేశ్వరం వద్ద బుధవారం నీటిఉధృతి నిలకడగా కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానికంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పశ్చిమ డెల్టాకు నీటివిడుదల తగ్గించారు. మూడు డెల్టాకాలువలకు 9,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 11.09మీటర్లు, పేరూరులో 14.93మీటర్లు, దుమ్ముగూడెంలో 11.34మీటర్లు, భద్రాచలంలో 39 అడుగులు, కూనవరంలో 16.14 మీటర్లు, కుంటలో 7.63మీటర్లు, పోలవరంలో 32.07 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వేబ్రిడ్జి వద్ద 15.17 మీటర్లకు నీటిమట్టాలు నెలకొన్నాయి.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే ఏమిటీ వైఖరి?
- బాధ్యతారాహిత్యంతో చెడ్డపేరు తెస్తే సహించేది లేదు
- గీత గీసుకోవద్దు.. మానవతా దృక్పథంతో పనిచేయాలి
- ప్రభుత్వాస్పత్రిపై సమీక్షలో కలెక్టర్ మాధవీలత ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.మాధవీలత



సమీక్షకు హాజరైన వైద్యులు

సాక్షి, రాజమహేంద్రవరం: 'ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల, బోధనాసుపత్రిని అందుబాటులోకి తెస్తోంది. సిబ్బందినీ నియమించింది. మీ సమన్వయ లోపం , నిర్లక్ష్యం కారణంగా వైద్య సేవలు తీసికట్టుగా మారాయంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కుబడిగా ఆస్పత్రి సూపరింటెండ్ వస్తూపోతున్నారంటూ మండిపడ్డారు. మంగళవారం కొత్త మెడికల్ కళాశాల భవనంలో వైద్యాధికారులు, వైద్యులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

సమన్వయం ఏదీ?

నూతన వైద్య కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు నేపథ్యంలో వైద్యాధికారులు సమన్వయం, నిబద్ధతో పనిచేయాలన్నారు. మిగిలిన జిల్లాల జీజీహెచ్ వైద్య సేవలు, మన జీజీహెచ్ పనితీరును పోల్చుకోవాలన్నారు. ఇటీవల ఒక చిన్న పిల్ల మరణిస్తే పోస్టు మార్టం కోసం తాను ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకే సంబంధిత డాక్టర్ వెళ్లిపోయారని సమాధానం వచ్చిందన్నారు. గతంలో, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవల గణాంకాలతో తన వద్దకు రావాలని ఆదేశించారు. వైద్యులు వ్యక్తిగత బాధ్యత, మానవీయ విలువలతో కలిగిన సేవలు అందించాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌లో అందుబాటులో ఉండాలన్నారు.

ప్రసవాలపై పట్టింపేదీ?

ప్రభుత్వ ఆస్పత్రిలో 8 మంది ప్రసూతి వైద్యులున్నా ఆ స్థాయిలో ప్రసవాలు ఎందుకు జరగడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. నెలకు ఒక వైద్యుడు 30 డెలివరీలు మాత్రమే చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్ని జరుగుతున్నాయో తెలుసా? అని ప్రశ్నించారు. మచిలీపట్నం జీజీహెచ్‌లో నెలకు 500 ప్రసవాలు నమోదవుతుంటే ఇక్కడ 320 జరుగుతున్నాయన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేస్తుండటం దురదృష్టకరమన్నారు. ఇక్కడి రోగుల్లో పేద నిరుపేద కుటుంబానికి చెందిన వారే ఉంటారని గుర్తించాలన్నారు.

ఆరోగ్యశ్రీపై అలుసా?:

ఆరోగ్య శ్రీ పథకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యం చేస్తున్నారని మాధవీలత మండిపడ్డారు. ఆరోగ్య శ్రీలో నమోదు చేయకపోవడంతో ఫిబ్రవరిలో 80, మార్చి 300 , ఏప్రిల్‌లో 269, మేలో 280 మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోయారు. దీనివల్ల ఎంత ఆదాయం కోల్పోయామో తెలిసిందా? అని ఆస్పత్రి వర్గాలను కలెక్టర్ ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ కింద అర్థోపెడిక్ విభాగంలో మార్చిలో 59, ఏప్రిల్ లో72, మేలో 100, జూన్‌లో 92 మందికి మాత్రమే చికిత్స చేయడం దారుణమన్నారు. ఆరోగ్య మిత్ర సరిగ్గా పని చెయ్యకపోతే మరొకరిని నియమించాలనిఆదేశించారు. క్రిటికల్ కేర్ విభాగంలో 300 మందికి సేవలు అందించగా, ఇద్దరు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద ఉన్నారంటూ విస్మయం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ ప్రారంభం సరికి అన్ని వసతుల కల్పన పూర్తి కావాలని కలెక్టర్ చెప్పారు.

సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.సౌభాగ్య లక్ష్మి, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.సుబ్రహ్మణ్యం, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్.సనత్ కుమారి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఆర్ ఎంఓ డాక్టర్ ఎస్కే నసీరుద్దీన్ పాల్గొన్నారు.

రత్నగిరిపై రింగ్ రోడ్డు నిర్మాణం

రెండు ఘాట్‌రోడ్లు కలుపేందుకు చర్యలు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదటి ఘాట్‌రోడ్ నుంచి వనదుర్గ అమ్మవారి ఆలయం మీదుగా రెండో ఘాట్‌రోడ్‌కు మరో రింగ్ రోడ్ నిర్మించేందుకు దేవస్థానం అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రతిపాదిత రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న మొక్కలు, తుప్పలు(జంగిల్ క్లియరెన్స్) తొలగిస్తున్నారు. సత్యదేవుని ఆలయానికి వివిధ వాహనాలలో వచ్చే భక్తులు మొదటి ఘాట్‌రోడ్ ద్వారా కొండ మీదకు చేరుకుంటున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రెండో ఘాట్‌రోడ్ ద్వారా దిగువకు వెళ్తున్నారు. శని, ఆదివారాలు, దశమి, ఏకాదశి వంటి పర్వదినాలు, కార్తికం, వైశాఖం, మాఘం, ఆశ్వీయుజ మాసాలలో స్వామివారి ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తుంటారు. ఆ రోజుల్లో దిగువకు దిగే సమయంలో ఘాట్‌రోడ్‌లో వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వాహనాలు దిగువకు వచ్చేందుకు మొదటి ఘాట్‌రోడ్ నుంచి ఓల్డ్ సెంటినరీ, న్యూ సెంటినరీ, డార్మెట్రీ వెనుక వనదుర్గ అమ్మవారి ఆలయం వరకు రింగ్ రోడ్ నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి

- స్కిల్ హబ్‌ల ఏర్పాటు : హోం మంత్రి వనిత
- కొవ్వూరు మెగా జాబ్ మేళాకు విశేష స్పందన
- 2,105 మందికి ఉద్యోగావకాశాలు



కొవ్వూరులో నిర్వహించిన మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న హోమ్‌మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, మంత్రి వనిత సారథ్యంలో మంగళవారం కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసే కర్మాగారాల్లో స్థానిక యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా 2.60 లక్షల మందికి, సచివాలయాల ద్వారా 1.30 లక్షల మందికి ఉపాధి కల్పించిందన్నారు. నాలుగేళ్లలో వైద్య రంగంలో సుమారు 50 వేల పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంతో విలీనం చేయడం ద్వారా 50 వేల మందికి ఉపాధి లభించిందన్నారు. డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి స్కిల్ హబ్‌ను, జాబ్ మేళాను ఎంపీ మార్గాని భరత్‌రామ్‌తో కలిసి వనిత ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్‌భరత్ మాట్లాడుతూ కెరీర్‌ను మెరుగుపరుచు కోవడం ద్వారానే యువత ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు మాట్లాడుతూ 35 సంస్థల ద్వారా 2,105 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. ఈ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది.

ఉద్యోగ భద్రతపై నమ్మకం

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి కల్పించడం అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో ఉద్యోగం కల్పిచడంతోపాటు వారు ఆ ఉద్యోగంలో నిలదొక్కుకుంటున్నారా? లేదా? అనే విషయాలను నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు గమనించాలని సూచించారు. ఉద్యోగ సమయంలో ఒప్పందం చేసుకుని అర్ధాంతరంగా తొలగిస్తే ఒప్పంద కాలానికి ఆ ఉద్యోగికి జీతం చెల్లించేలా చర్యలు తీసుకుంటేనే సంస్థలకు భయం ఉంటుందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

తొలిదశలో 295 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరికి హోం మంత్రి తానేటి వనిత మంగళవారం రాత్రి నియమాక పత్రాలను అందజేశారు. జాబ్ మేళాకు 1,863 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. మరో 116మంది తొలి దశ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యా రని,రెండో విడత పరీక్షకు ఎంపికైతే వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

దోసకాయలపల్లి డ్వాక్రా సంఘాలకు నిధులు జమ

ఫలించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి



సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపిన సభ్యులు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఆరు డ్వాక్రా గ్రూపులకు రావల్సిన మొత్తం ఎట్టకేలకు జమ అయ్యింది. ఇందుకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవ తీసుకున్నారు. మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు ఈమేరకు తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఏం జరిగిందంటే.. రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లాలనే సంకల్పంతో రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2019 ఏప్రిల్ నాటికి బ్యాంకులకు బకాయి ఉన్న డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. అన్ని డ్వాక్రా గ్రూపులకూ రుణ మాఫీ వర్తించింది. కానీ కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందుల కారణంగా దోసకాయలపల్లిలోని ఆరు డ్వాక్రా గ్రూపుల ఖాతాల్లో నగదు జమకాలేదు. దీంతో బాధిత సంఘాలు తమ సమస్యను కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ద్వారా ఎమ్మెల్యే రాజాకు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రాజా తాడేపల్లిలోని సీసీఎంఓ కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో ఈ గ్రూపులకు చెందిన సభ్యులకు నగదు ఇటీవల ఖాతాల్లో జమయ్యింది. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి ఈ డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు వచ్చి ఎమ్మెల్యే రాజాకు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు బేదంపూడి పాప, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొల్లవిల్లి మురళీ కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, ఏపీఎం జయంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి 'పంచాయతీ'కి చెక్

- డిజిటల్ విధానం కింద చెల్లింపుల ప్రక్రియ
- అన్ని పంచాయతీల్లో వచ్చే నెల 15 నుంచి అమలు
- పారదర్శకంగా లావాదేవీల నిర్వహణకు ఆస్కారం
- ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

పిఠాపురం మండలం నాగులాపల్లి పంచాయతీలో వెంకటేశ్వరరావు ఇంటి పన్ను చెల్లించారు. తనకు వచ్చిన డిమాండ్ నోటీసు ప్రకారం కార్యాలయానికి వెళ్లి నగదు చెల్లించారు. కొన్నాళ్ల తర్వాత గాని తెలియలేదు. అతని సొమ్ము పంచాయతీ ఖాతాకు జమ కాలేదని..సిబ్బంది కట్టలేదు. తీరా తెలిశాక లబోదిబోమన్నారు. ఈయనొక్కరే కాదు. మరికొందరికీ ఇదే అనుభవం. సిబ్బంది చేతివాటానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను ప్రవేశపెడుతోంది.



డిజిటల్ పేమెంట్స్ చేయాలని గ్రామాల్లో అవగాహన కోసం పంచాయతీలు తయారుచేసిన ఫ్లెక్సీ



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నగదు రూపంలో వసూళ్లకు గ్రామ పంచాయతీలు ఇకపై గుడ్‌బై చెప్పేయనున్నాయి. కేవలం డిజిటల్ చెల్లింపులు మాత్రమే అంగీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. వచ్చే నెల 15 నుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటి నుంచి పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలకాల్సి ఉంటుంది. డిజిటల్ చెల్లింపులు మాత్రమే చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాలి

గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత మొత్తంలో చెల్లించాల్సిన రుసుముతో పాటు ఇంటి యజమానులు ప్రతీ ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మెషీన్లను కూడా అన్ని పంచాయతీలకూ సమకూర్చనున్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు వీలుగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

అవినీతి ఇక ఆస్కారం లేదు

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేసి కొందరు సిబ్బంది సొంత అవసరాలకు వాడుకొనేవారు. ఎప్పుడో అధికారులు తనిఖీ చేసిన సందర్భంలోనే అవి బయటపడేవి. అప్పుడు నీళ్లు నమిలేవారు. తప్పనిసరి పరిస్థితిలో రికవరి చేసేవారు. తనిఖీలు చేయకుంటే జేబుల్లోకి వెళ్లిపోయేవి. లెక్కా జమా ఉండేది కాదు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రూ.3.30 లక్షలు, బిల్లు కలెక్టర్ 2.24 లక్షలు ఇంటి పన్నులు పంచాయతీకి జమచేయలేదు. ఆ నిధులను స్వాహా చేశారు. ఇటీవల అధికారులు రికార్డులు తనిఖీ చేయగా అవినీతి పర్వం బట్టబయలైంది. పిఠాపురం మండలం నాగులాపల్లి పంచాయతీల్లోను లక్షలాది రూపాయిలు ఇంటి పన్నులు వసూలు చేసి స్వాహా చేశారు. ఇటీవల అధికారులు తనిఖీల్లో ఈ గుట్టు రట్టయింది. ఇకపై ఇలాంటి అవినీతి వ్యవహారాలకు డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ ద్వారా చెక్ పెడతారు. దీనివల్ల ప్రజల నుంచి వసూలు చేసిన ప్రతీ రూపాయి పంచాయతీ ఖాతాకు వెళుతుంది. ఖర్చు చేయాల్సి వస్తే సంబంధిత కాంట్రాక్టరుకు కూడా డిజిటల్ పద్ధతిలోనే చెల్లించాలి. దీంతో ఎలాంటి అవినీతికీ అస్కారం ఉండదు.


లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే

జిల్లాలో 385 పంచాయతీల నుంచి ప్రతీ ఏటా ఇంటి పన్నుల రూపంలో రూ.39.78 కోట్లు వసూలవుతోంది. కుళాయి పన్నులతోపాటు ఇతర పన్నుల రూపంలో రూ. 4.72 కోట్లు వసూలవుతోంది. ఆగస్టు 15 తర్వాత పన్ను వసూలు లావాదేవీలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారా చేపట్టనున్నారు. పన్నుల మొత్తాన్ని ఒక్క రూపాయి కూడా నగదు రూపంలో పంచాయతీ అధికారులు స్వీకరించరు. ఈ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూలు మాత్రమే కాకుండా పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్, పారిశుద్ధ్య మెటీరియల్, వీధిలైట్ల స్పేర్‌పార్టులు, గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులకు సైతం డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరుగుతాయి.

తూర్పుగోదావరిజిల్లా...

మండలాలు:	18
గ్రామపంచాయతీలు:	300
ఇంటిపన్ను డిమాండ్ 2022-23:	రూ.44,24,29,350
వసూలు:	రూ.35,00,77,619
ఏరియార్స్:	రూ.22,42,38,008
వసూలు:	రూ.11,33,11,470
డిమాండ్ ఏరియర్స్ పన్నులు:	రూ.66,66,67,358
వసూలు:	రూ.46,33,89,089

అన్ని పంచాయతీలకు ఆదేశాలు



ఆగస్టు 15 తర్వాత ఏ ఒక్క పంచాయతీలో కూడా నగదు తీసుకోవద్దని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్ల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ ఖాతాలు ఉన్న బ్యాంకు నుంచి క్యూఆర్ కోడ్‌లు తీసుకొంటున్నారు. డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

జే.సత్యనారాయణ,
జిల్లా పంచాయతీఅధికారి,
తూర్పుగోదావరి.

క్లుప్తంగా

హత్య కేసులో జీవిత ఖైదు

పెద్దాపురం: శంఖవరం మండలం సిద్ధివానిపాలెంలో రెండేళ్ల కిందట జరిగిన హత్య కేసులో ముద్దాయి పట్టెం వెంకన్నకు స్థానిక 7వ జిల్లా కోర్టు జడ్జి నికిత జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. తన భార్యతో తన ఇంటి పక్కన ఉన్న అరివిడి తలుపులయ్యకు వివాహేతర సంబంధం ఉందని వెంకన్న అనుమానించాడు. ఈ నేపథ్యంలో 2020 మే 28వ తేదీ రాత్రి తలుపులయ్య కత్తితో నరికి హతమార్చాడు. దీనిపై అప్పటి అన్నవరం ఎస్సై ఆర్.మురళీమోహన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి నికిత పైవిధంగా తీర్పు చెప్పారు. పేరిశెట్టి మృత్యుంజయరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఇంటికి నిప్పు పెట్టిన వ్యక్తికి ఏడాది జైలు

గోకవరం: ఓ మహిళ ఇంటికి నిప్పు పెట్టిన కేసులో ముద్దాయికి న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన పోతుల కృష్ణారావు గత ఏడాది సెప్టెంబర్ 5న మల్లవరం గ్రామానికి చెందిన మిద్దె సత్యవతి అనే మహిళ ఇంటికి నిప్పు పెట్టాడు. ఆమె పక్క ఇంటికి చెందిన ఇంజరపు జగదీష్‌కు చెందిన బైక్‌ను కర్రతో కొట్టి ధ్వంసం చేశాడు. దీనిపై అప్పట్లో ఏఎస్సై రాంబాబు నాయక్ కేసు నమోదు చేశారు. ఎస్సై శివనాగబాబు చార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదనల అనంతరం ముద్దాయి కృష్ణారావుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం మొదటి అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వెంకట్రావు వాదనలు వినిపించారు. ఈ కేసులో సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ నజీర్ సుభానీని.. నార్త్ జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సైలు అభినందించారు.

180 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కారులో తరలిస్తున్న 180 కేజీల గంజాయిని టూటౌన్ సీఐ టి.గణేష్ ఆధ్వర్యాన పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఐదుగురు వ్యక్తులు రెండు కార్లలో గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా సమాచారం అందింది. దీనిపై జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ గణేష్ బృందం రోడ్ కం రైల్వే బ్రిడ్జిపై మాటు వేసింది. ఉదయం 9 గంటల సమయంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ కారులో 180 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో పాటు ఏడు సెల్‌ఫోన్లు, రూ.960 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లను సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న విశాఖపట్నం దువ్వలవాడకు చెందిన పంగి మోహనరావు, కర్ణాటక రాష్ట్రం చిక్పేటకు చెందిన నేయిన్‌సింగ్, రాజస్థాన్ రాష్ట్రంలోని భిన్మల్‌కు చెందిన మహేంద్రకుమార్, నిమ్బవాస్ ప్రాంతానికి చెందిన మహేంద్రకుమార్, మరో మైనర్‌ను పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

అవకాశాలు ఓపెన్

- ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు నోటిఫికేషన్
- ఇంటి దగ్గర నుంచే చదివే అవకాశం
- సాధారణ కోర్సులతో సమానంగా గుర్తింపు
- నేటి నుంచి అడ్మిషన్లు



సార్వత్రిక విద్యాలయం ద్వారా చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం: ఉన్నత విద్య కోసం ఆశ పడినా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వాళ్లు అనేక మంది ఉన్నారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడే వారూ ఉన్నారు. అటువంటి వారి చింత తీర్చేందుకు సార్వత్రిక విద్యా (ఓపెన్ స్కూల్) విధానం అందుబాటులో ఉంది. నియత పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాల బాలికలకు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రోజు వారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 160 స్టడీ సెంటర్ల ద్వారా ఏటా వేలాది మంది చదువుకునేందుకు దీని ద్వారా అవకాశం లభిస్తోంది. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీనితో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకూ అర్హులే అవుతారు.

ఇవీ సబ్జెక్టులు

- పదో తరగతికి గ్రూపు–ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బిలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.
- ఇంటర్‌కు గ్రూపు–ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బిలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.
- స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

నియత పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని 10, ఇంటర్ పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే.. రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్‌లో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలూ రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదో తరగతికైతే రూ.100, ఇంటర్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

ఇవీ అర్హతలు

- పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీనాటికి 14 సంవత్సరాలవయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితీ ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

కాంటాక్టు తరగతులు

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులు బుధవారం నుంచి స్వీకరిస్తారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 160 అక్రిడిటెడ్ ఇన్‌స్టిట్యూషన్లు (ఏఐ) ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.
- ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 25వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు.
- పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,150 చెల్లించాలి.
- ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనారిటీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాలి.
- ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల సంఖ్య ఏటా పెరుగుతోంది. అర్హతలు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ఆదివారం నిర్వహించే కాంటాక్టు క్లాసులకు అభ్యాసకులు రావాల్సి ఉంటుంది.



– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పు గోదావరి

సద్వినియోగం చేసుకోవాలి

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ గుర్తింపు ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు, చిరుద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి వారికి సార్వత్రిక విద్య వరంలాంటిది. ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది.



– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

రోడ్ కం రైల్వే బ్రిడ్జిపై 'పల్లెవెలుగు'కు అనుమతి

రాజమహేంద్రవరం సిటీ: రోడ్ కం రైల్వే బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా దీని నుంచి ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులకు వెసులుబాటు ఇచ్చారు. గోదావరికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, తణుకు, జంగారెడ్డిగూడెం తదితర డిపోలకు చెందిన సుమారు 80 పల్లెవెలుగు బస్సులు ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేందుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు చర్యలు చేపట్టామని రాజమహేంద్రవం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు.

ఐదుగురు సీఐలకు స్థానచలనం

ఏలూరు టౌన్: పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాలకు చెందిన ఐదుగురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఇద్దరిని వీఆర్‌కు తరలించారు. మరో ముగ్గురిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం తుని సీఐగా ఉన్న ఎం.నాగదుర్గారావును వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు సీఐ ఎం.గీతా రామకృష్ణను నియమించారు.

పేరు పులస.. అమ్మేది విలస

- అధిక ధరలకు నకిలీ చేపల విక్రయం
- గోదావరి జిల్లాల్లో వ్యాపారుల మాయ
- అసలు, నకిలీలను గుర్తించండిలా..



గోదావరిలో పులసల కోసం వేట సాగిస్తున్న మత్స్యకారులు



ఒరిజినల్ పులసలు

ఆత్రేయపురం: పులస సీజన్ వచ్చేసింది. నకిలీ పులసలు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. అంటే విలస అన్నమాట. చూసేందుకు పులస, విలస ఒకే రకంగా ఉంటాయి. రుచిలో భారీ తేడా ఉంటుంది. అంతే కాదు. ధరలో కూడా తేడా ఉంటుంది. పులస కేజీ చేప రూ.5 వేల నుంచి రూ.10 వేల వర ధర పలుకుతుండగా నకిలీ పులసను కూడా అదే ధరకు విక్రయిస్తూ పలువురు మోసం చేస్తున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో గోదావరికి భారీగా వరద వస్తుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉపనదులు తోడుగా గోదావరి పోటెత్తుతుంది. నది ఉధృతంగా ప్రవహించి తిరిగి నీటిమట్టం తగ్గుతున్న సమయంలో సముద్రం నుంచి విలసలు గోదావరి నీటిలోకి ఎదురీదుతూ వస్తాయి. ఆ విధంగా కేంద్ర పాలిత ప్రాంతం యానాం సమీపాన సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురు ప్రయాణం ప్రారంభించిన విలసలు సుమారు 40 కిలోమీటర్ల మేర గోదావరిలో ఎదురీత పూర్తయ్యే సరికి పులసలుగా రూపాంతరం చెందుతాయని మత్స్యకారులు అంటారు. ఆ పులసలు కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు మండల గ్రామాలైన ఆత్రేయపురం, బొబ్బర్లంక, పేరవరం, రాజవరం, మెర్లపాలెం, చొప్పెల్ల, రావులపాలెం తదితర ప్రాంతాల్లో పులస దొరుకుతుంది. కానీ విలస చేప మాత్రం సముద్రంలోనే దొరుకుతుంది. దీని ధర కేవలం రూ.200 నుంచి రూ.500 లోపే ఉంటుంది. ఒడిశా, ముంబై, విశాఖ తదితర సముద్ర తీర ప్రాంతాల్లో వీటిని పట్టి ఐస్ బాక్సుల్లో నిల్వ చేసి గోదావరి ప్రాంతాలకు ఈ సీజన్‌లో తరలించి పులస పేరుతో 10 రెట్లు ఎక్కువ ధరకు విక్రయించి మత్స్య ప్రియులను మోసం చేస్తున్నారు. పుస్తెలు అమ్మి అయినా ఏడాదికి ఒక్కసారి పులస కూర తినాలనే నానుడి ఉన్న కోనసీమ వాసులు ఎంత ధరయినా వెనకాడకుండా పులసలు కొని తృప్తిగా ఆరగిస్తున్నారు. అయితే ఈ పులసలు గోదావరిలో ఎర్ర నీరు ఉన్నంత వరకూ మాత్రమే దొరికే అవకాశం ఉండటంతో నకిలీ పులసలను తెచ్చి కొందరు వ్యాపారం చేస్తున్నారు. కొత్తగా పులస చేపల కొనుగోలుకు వస్తున్న వారు విలస బారిన పడి మోసపోతున్నారు.

ఇంతకీ పులసకు, విలసకు తేడా గమనిస్తే..

పులస చేప నిగనిగలాడుతూ ఉంటుంది. ఎటువంటి రంగూ లేకుండా పూర్తి తెలుపు రంగులో ఉంటుంది. చల్లదనం అసలే ఉండదు. చేప మొత్తం జిగురుగా అంటే పట్టుకుంటే జారిపోయేలా ఉంటుంది. కేవలం గోదావరి బ్యారేజీల వద్ద లేదా పరీవాహక ప్రాంతంలో మాత్రమే పులస చిక్కుతుంది. విలసగా ఉన్న చేప సముద్రం నుంచి 40 లేదా 50 కిలోమీటర్లు గోదావరికి ఎదురీదుతూ వచ్చి పులసగా మార్పు చెందుతుంది. వీటిని వండిన తరువాత వారం రోజులైనా కూర రుచిగానే ఉంటుంది.

విలస (నకిలీ పులస)



చేపకు నిగారింపు ఉండదు. ఎరుపు, పసుపు రంగుల్లో ఉంటుంది. చల్లగా ఉంటుంది. ఎందుకంటే ఐస్ బాక్స్‌ల్లో నిల్వ చేస్తారు. చేప పట్టుకుంటే పెద్ద జిగురుగా ఉండదు. ఎక్కడబడితే అక్కడ వీటిని విక్రయిస్తూ ఉంటారు. కేవలం సముద్రంలో మాత్రమే ఇవి దొరుకుతాయి. అక్కడ నుంచి ఐస్ బాక్సుల్లో నిల్వచేసి పులసలు అమ్మే ప్రాంతానికి తరలించి పులస ధరకే వీటిని విక్రయిస్తుంటారు. వీటిని వండిన మరుసటి రోజుకే కూర రుచి తగ్గుతుంది.

చేప ప్రియులను మోసం చేస్తున్నారు

సముద్రంలో పుట్టిన విలసను గోదావరి జిల్లాలకు తీసుకువచ్చి పులస పేరుతో మత్స్య ప్రియులను మోసం చేస్తున్నారు. పులస కేవలం సముద్రంలోనే పుడుతుంది. అది 20 నుంచి 40 కిలోమీటర్ల మేర గోదావరిలో ఎదురీదిన తరువాత పులసగా మారుతుంది. ఐస్ బాక్సుల్లో విలసను తెచ్చి మత్స్యప్రియులను మోసం చేస్తున్నారు. దాని వల్ల మాలాంటి జాలర్లు నష్టపోతున్నాం.



– లంకె వెంకటకృష్ణ, మత్స్యకారుడు, ఆత్రేయపురం

పట్టుబడిన దొంగల ముఠా

- రూ.50 లక్షల సొత్తు రికవరీ
- వెల్లడించిన డీఎస్పీ ప్రసాద్



చోరీ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

మండపేట: పట్టణంలో చోరీకి పాల్పడిన ఓ దొంగల ముఠా పోలీసులకు పట్టుబడింది. ఈ ముఠా సభ్యులందరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. వీరు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అనేకచోట్ల నేరాలకు పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ ప్రసాద్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని బ్యాంక్ కాలనీకి చెందిన మెర్ల వీర్రాజు గత ఏడాది జూలై నెలలో ఒడిశా వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వచ్చేసరికి ఆయన ఇంటి తలుపులు బద్దలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాలు, రామచంద్రపురం డీఎస్పీ సూచనల మేరకు మండపేట సీఐ ఆధ్వర్యాన ఎస్సైలు ఎం.అశోక్, కె.అప్పారావు సారథ్యాన పోలీసుల బృందం దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం గుంటూరుకు చెందిన రాయపాటి వెంకయ్య, కావాటి అంజయ్య, కుంభ సాంబశివరావు ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఆలమూరు మండలం గుమ్మిలేరు రోడ్డులో సంచరిస్తుండగా వారిని పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి రూ.50 లక్షల విలువైన 614 గ్రాముల బంగారు వస్తువులు, రెండున్నర కిలోల వెండి, 4 మోటార్ సైకిళ్లు, ఒక ఆటో, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మరో కేజీ బంగారాన్ని గుంటూరులోని ఒక షాపులో అమ్మినట్టు సమాచారం ఉందని డీఎస్పీ తెలిపారు. వారు ఉభయ గోదావరి జిల్లాల్లో 17 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ కేసును ఛేదించిన మండపేట ఎస్సైలు అశోక్, అప్పారావు, సిబ్బంది సీహెచ్ ఎస్ కుమార్, ఎన్.సతీష్, పీవీఎస్ సత్యనారాయణలను డీఎస్పీ ప్రసాద్ అభినందించారు.

ఒంటరి మహిళను ఆదుకున్న పోలీసులు

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఒంటరిగా కనిపించిన ఓ మహిళను పోలీసులు ఆదుకున్నారు. ఆ రహదారిపై రాత్రి గస్తీ కాస్తున్న ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు, అన్నవరం అదనపు ఎస్సై జి.వెంకటేశ్వరరావులు స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్నారు. ఆమెను సమీపంలోని వృద్ధాశ్రమంలో చేర్చారు. ఆమెకు ఆహారం, దుస్తులు అందించారు. ఉదయం వచ్చి, ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రీతూ సాహూగా గుర్తించారు. తన భర్త పేరు జితేంద్ర అని ఆమె చెప్పింది. ఆమెను సీడీపీఓ సుబ్బలక్ష్మి, మహిళా పోలీసుల సహకారంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెను బంధువులకు సురక్షితంగా అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

బాలికను కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్ అరెస్టు

సామర్లకోట: బాలికను కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కె.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గణేష్ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్టు తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. మానసిక దివ్యాంగురాలైన ఆ బాలిక స్థానిక భవిత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కిరాణా దుకాణానికి వెళ్లిన ఆ బాలిక ఎంతకూ తిరిగి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. ఆ బాలికను ఆటో డ్రైవర్ బొద్దు నాగేశ్వరరావు తన ఆటోలో తీసుకు వెళ్లినట్టు ఆమెకు బంధువైన మరో ఆటో డ్రైవర్ గుర్తించాడు. ఈ మేరకు తల్లిదండ్రులు, ఎస్సై టి.సునీత నాగేశ్వరరావు ఆటో కోసం గాలించారు. పిఠాపురం రోడ్డులోని తంబులోడి గొయ్యి వద్ద పుంత రోడ్డు పొదల్లో ఆటో ఉన్నట్టు గుర్తించారు. సమీప పొలాల వద్ద గాలించి నిందితుడు నాగేశ్వరరావును, కిడ్నాపైన బాలికను గుర్తించారు. బాలిక బంధువులు ఆటో డ్రైవర్ నాగేశ్వరరావుకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. అతడిని సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన ఎస్సై సునీత అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై బాలిక కిడ్నాప్, పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: పిఠాపురం – ఉప్పాడ రోడ్డులో మంగళవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. పిఠాపురానికి చెందిన ఒక యువకుడు మోటార్ సైకిల్‌పై నాగులాపల్లి వైపు నుంచి పిఠాపురం వైపు వెళ్తున్నాడు. ఎండపల్లి జంక్షన్ వద్ద ఎదురుగా ఉప్పాడ వైపు వెళ్తున్న ఆటోను అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని పిఠాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

APSFC ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ
(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ LXIII OF 1951 క్రింద ఏర్పాటు చేయబడింది)
డి.నెం.19-5-9, 2వ అంతస్తు, స్వతంత్ర పెట్రోల్ బంక్ ప్రక్కన, కంబాలచెరువు దగ్గర, రామచంద్రరావు పేట, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా
ఫోన్ నెం.0883-2442766, 9949358513, ఇ-మెయిల్: rajahmundry@apsfc.com

Ref No: AFC/SARFAESI /MR&R/2023-24/ Date: 21.07.2023

స్వాధీనత ప్రకటన

(స్థిరాస్తి కొరకు) (అనుబంధం-IV, రూల్ 8(1) చట్టం క్రింద)

[illegible]

లోన్ ఖాతా నెం.	తేది.31.01.2023 నాటికి మొత్తం బకాయి (రూ.లక్షలలో)			
	Prin.	Int.	OE	Total
RJ55285701	19.24	3.82	0.00	23.06
RJ55285702	3.68	0.59	0.00	4.27
RJ55285703	17.25	3.22	0.00	20.47
RJ55286704	40.00	7.03	0.00	47.03
RJ55285705	7.47	0.93	0.00	8.40
మొత్తం	87.64	15.59	0.00	103.23

[illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

తేది : 21-07-2023
ప్రదేశం : రాజమహేంద్రవరం

సం/-అధీకృత అధికారి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874 [R-60]

DISTANCE EDUCATION

■ ఇంటర్ ఫెయిల్యూరా ! చింతించకండి - Join Inter One Sitting. Govt. Recognised Board. Exams : October - 2023. (C) Vijayawada : 89774 25849, 91333 40140 [V- 2030]

Real Estate

■ రాజమండ్రిలో ప్రముఖ విద్యాసంస్థల బొమ్మూరు, వేమగిరి, కాతేరు, దివాన్‌చెరువు ఏరియాలో 3 ఎకరాలు వారి స్థలంలో 1,00,000 Sft గల బిల్డింగ్ లీజ్ ఇవ్వబడును వారు సంప్రదించగలరు. ✆ : 93913 31643 [R-6020]

REAL ESTATE WANTED

■ రాజమండ్రి, బొమ్మూరు, వేమగిరి, కాతేరు, దివాన్ చెరువు పరిసర ప్రాంతాల్లో 2 నుండి 5 ఎకరాల్లో పొలం లేక స్థలం అమ్మబడును సంప్రదించగలరు. ✆ : 93913 31643 [R-6021]

HOUSE FOR SALE

■ RJY నేతాజీ నగర్ 11వ వీధిలో E/N 2B/R గ్రౌండ్, 1st ఫ్లోర్ 116 గజాలు ఇల్లు అమ్మకము. ✆ : 96405 33443, 98666 90041 [R-6012]

SERVICES

■ బంగారం బ్యాంకులలో/సి ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [R-78996]

■ బంగారం బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తాకట్టులో ఉన్న విడిపించి కొనబడును. ✆ : 73966 71666 [R-6024]

BUSINESS OFFER

■ మీ వ్యాపారం ఏదైనా భాగస్వామ్యం 3 నుండి 5 లక్షల వరకు పెట్టుబడి పెట్టబడును. ✆ : 99634 40134 [V- 10882]

Wanted

■ పార్ట్‌టైం/ఫుల్‌టైం మంచి ఆదాయం 18 సం॥ నిండిన ఆసక్తి గలవారు. RJY. ✆ : 80962 25555 [R-1171852]

■ ఇంట్లోనే వుంటూ ఆదాయం కావలెను. ఫోన్: 70139 19459 [V- 2048]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. జీతం 12000/-. ఫోన్: 72074 45296 [V-6195]

■ ప్రముఖ గ్లోబల్ సంస్థకు ✆ 95736 33520, 90596 33520. [M-1221346]

■ ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-249]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ 9676414393. [M-1221463]

■ ✆ 63017 07038, 98481 52681. [O-786147]

■ ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. 7036253618. [W-189107]

■ 12000-35000/-, Hyd. 7893589999 [RA-440]

■ Wanted Marketing Vice Principals, Class Incharges, Qualification: Any Degree, Salary: 12000/- to 20000/-. Experienced Persons Preferable. (Male Only) Age: 25 to 45. Job Location Rajahmundry, Master Minds College. Contact 92487 33370 [G-4498]

■ రాజమండ్రిలో ప్రముఖ ✆ : 93922 69369 [R-51]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారుల తెలివితేటలు లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.